


# కాంటర్‌విల్ దయ్యం

ఆస్కార్‌వైల్డ్ కథ

స్వేచ్ఛానువాదం : కె.ఎన్.వై. పతంజలి

**హీరమ్ ఓటిస్ అనే అమెరికన్, కాంటర్ విల్ భవనాన్ని కొంటానంటే తెలిసిన వాళ్లంతా వద్దన్నారు. ఆ భవంతి యజమాని కూడా "వద్దండీ, అదొక దయ్యాల కొంప ... మేమే ఉండలేకపోయాం!" అని చెప్పాడు.**

"లార్డు కాంటర్ విల్ గారూ! ఆ భవనాన్నీ, అందులోని దయ్యాన్నీ నాకు అమ్మేయండి. మా అమెరికాలో అటువంటి నమ్మకాలు లేవు!" అని స్పష్టంగా చెప్పి హీరమ్ ఓటిస్ ఆ భవనాన్ని కొనేశాడు.

"ఆ తరువాత నన్ను తప్పుబడితే, ఒప్పుకోను సుమా!" అని హెచ్చరించి మరీ లార్డు కాంటర్ విల్ ఆ భవనాన్ని అమ్మేశాడు. ఓ నాలుగు వారాల విశ్రాంతికోసం ఓటిస్ కుటుంబ సమేతంగా ఇంగ్లండ్ వచ్చి ఆ ఇంట్లో దిగిపోయాడు.

ఆ ఇల్లు చాలా పెద్దది. నాలుగు వందల సంవత్సరాల క్రితం కాంటర్‌విల్ పూర్వీకులు దాన్ని కట్టారు. మూడు వందల సంవత్సరాల క్రితం కాంటర్ విల్ ముత్తాతగారు తన భార్యను చంపేసి, తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. అలా చచ్చి అతడు దయ్యమైనాడు. ఆ దయ్యాన్ని చూసి జడుసుకుని చాలా కాలం క్రితం కాంటర్‌విల్ మకాం మార్చేశాడు. అప్పటినుంచి ఒక ముసలావిడ మాత్రం ఆ ఇంటిలో కాలక్షేపం చేస్తున్నది. ఆవిడకీ దయ్యమంటే భయమే గానీ, ఆ దయ్యాన్ని ఆవిడ మర్యాదగానూ, భయభక్తులతోనూ చూసుకునేది గనుక ఆ దయ్యం ఆవిడ జోలికి రాలేదు.

ఓటిస్‌కు భార్య, నలుగురు పిల్లలూ ఉన్నారు. పెద్దవాడి పేరు వాషింగ్‌టన్. రెండోది కుమార్తె. వర్జీనియా అనే పేరున్న ఆ అమ్మాయి

ఎంతో అందమైనది. కడమ వాళ్లిద్దరూ కవలలు.



*చివరికి ఆమె, తన గదిలోనే ప్రత్యక్షం అయింది. ఆమె బాగా నలిగిపోయి, పాలిపోయి ఉంది. కళ్లుమాత్రం కాంతివంతంగా మెరుస్తున్నాయి. ఆమె చేతిలో ఒక దంతపు పెట్టె ఉంది.*

***

ఓటిస్ కుటుంబం ఆ ఇంట్లో దిగిన రోజే డ్రాయింగు రూమ్‌లో గచ్చుమీద వాళ్ల కొక ఎర్రని మచ్చ కనిపించింది. అదేమిటీ అని అడిగితే అదే స్థలంలో మూడు సంవత్సరాల క్రితం సైమన్ కాంటర్‌విల్ అనే మహనీయుడు తన భార్యను కత్తితో పొడిచి చంపేశాడని ఆ ఇంటిలో పూర్వం నుంచీ ఉంటున్న ముసలావిడ చెప్పింది.

"అయితే మాత్రం ... ఇంట్లో రక్తం మరకలూ, అవీ ఏమిటీ ఛండాలంగా!" అంటూ ఓటిస్ పెద్ద కొడుకు ఒక డిటర్జంట్ ద్రవంతో ఆ నెత్తుటి మరకను చెరిపేశాడు. కానీ మరుసటి రోజు పొద్దున్న చూస్తే అక్కడ ఇదివరకు కంటే ఎర్రగా ఉన్న రక్తం మరక కనిపించింది. వాషింగ్‌టన్ దానిని మళ్లీ చెరిపేశాడు. మరుసటి రోజూ మళ్లీ మరక ప్రత్యక్షం అయింది. వాషింగ్‌టన్ మంచి పట్టుదలగా మళ్లీ చెరిపేశాడు. ఆ మరునాడు మళ్లీ ఆ మరక తయారయింది.

అంతవరకూ దయ్యాలూ, గియ్యాలూ లేవని వాదించిన ఆ కుటుంబంలో సందేహాలు మొదలైనాయి.

***

రాత్రి పదకొండు గంటలకి ఓటిస్‌కి నిద్రలోంచి మెలకువ వచ్చింది. గది బయట వరండాలో ఎవరివో.. అడుగుల చప్పుళ్లు వినిపిస్తున్నవి. ఉక్కు గొలుసులు ఈడ్చుకుంటూ ఎవరో నడుస్తున్నారు.

ఓటిస్ చిరాకుగా మంచం దిగి, డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులోంచి చిన్న సీసా తీసి తలుపు తీశాడు.

ఎదురుగా ఒక ముసలి దయ్యం వికారంగా నిల్చుని ఉంది. కళ్లు చింత నిప్పుల్లాగున్నాయి. జుట్టు అట్టలు కట్టేసి ఉంది. ఎన్ని వందల సంవత్సరాల క్రితం ఫాషన్‌లోనో కుట్టించిన దుస్తులు మురికిపట్టి, కంపుగొడుతున్నాయి. దాని చేతులనుంచి, కాళ్లనుంచి ఉక్కు గొలుసులు వేలాడుతున్నాయి.

"అయ్యా! ఆ గొలుసులకి ఈ గ్రీజు పూస్తే చప్పుడు రాదు. రాత్రివూట నా నిద్ర చెడదు. వాడండి!" అని చెప్పేసి ఓటిస్ ఆ సీసా పక్కనే ఉన్న టేబుల్ మీద పెట్టేసి తన గదిలోకి వెళ్లి తలుపులు మూసేశాడు.

ఆ దయ్యం ఒక్క క్షణం కొయ్యబారిపోయింది. మరుక్షణంలో దానికి హద్దుమీరిన కోపం వచ్చింది. ఆ సీసా తీసి నేలకేసి కొట్టేసింది. పిచ్చి కేకలు వేసుకుంటూ అది వరండాలో నడిచింది. అది మెట్లెక్కుతుంటే వరండాలో ఓ తలుపు తెరుచుకుంది. ఓటిస్ కవల పిల్లిద్దరూ బయటకు రావడాన్ని ఆ దయ్యం గమనించింది.

వచ్చిన వాళ్లు ఊరుకోకుండా పెనువేగంతో ఆ దయ్యంమీదకు దిండొకటి విసిరారు. అది వెంట్రుకవాసిలో తప్పిపోయేసరికి మరో దిండు విసిరారు.

దయ్యం కంగారుపడిపోయి తప్పించుకునే స్థానం తెలియక అదృశ్యం అయిపోయింది.

***



కిటికీలోంచి ఆ గదిలోకి వెన్నెల కిరణాలు పడుతున్నాయి. దయ్యం ఒక కిరణాన్ని అనుకుని, దానిమీద మోచేయి ఆన్చి ఆలోచనలో పడింది. దానికి ఇంకా అలుపు తీరలేదు.

మూడు వందల సంవత్సరాల కాలంలో దానికి ఇంత ఘోరమైన అవమానం ఎన్నడూ జరగలేదు. తల కొట్టేసినట్టు అయిపోయింది.

మహామహుల్ని జడిపించానే ... నేను కనిపించేసరికే భయంతో స్పృహ తప్పి పడిపోయేవారే. పిచ్చెత్తిపోయి జీవితాంతం ఆసుపత్రుల్లో గడిపేవారే! అటువంటి దయ్యాన్ని ఈ అమెరికా గాడిదకొడుకులు ఇంత చులకనగా చూస్తారా? గొలుసులకు రాయడానికి గ్రీజు సీసా ఇస్తాడా? వాడి కొడుకులు నా మీదకు దిళ్లు విసురుతారా? చూద్దాం! దెబ్బకు దెబ్బ తియ్యనా? పగ సాధించనా? అని ఆ దయ్యం ఆలోచిస్తూ తెల్లవార్లూ అక్కడే గడిపింది.

వారం రోజుల తరువాత ఓటిస్ ఇంటిల్లిపాదీ నిద్రలోంచి కంగారుగా లేచి మేడమీదనుంచి కిందకు దిగారు. ఒక పెద్ద చప్పుడుకు వాళ్లందరికీ మెలకువ వచ్చింది. ఏమిటో చూద్దామని పోతే ఒక పెద్ద కవచం డ్రాయింగ్ రూమ్‌లో గచ్చుమీద పడి ఉంది. అంత దూరాన ఉన్న ఒక కుర్చీమీద దయ్యం కూర్చుని, తన మోకాళ్లు చేతులతో రుద్దుకుంటోంది. దాని మొహం బాధతో ముడుచుకుని ఉంది.

ఓటిస్ జేబులోంచి పిస్తోలు తీసి, కాలిఫోర్నియా వారి మర్యాద పాటిస్తూ, "చేతులు పైకెత్తు!" అని ఆజ్ఞాపించాడు. అతని కవలపిల్లలు మాత్రం జేబులోంచి కాటిల్ బార్‌లు తీసి రెండు రాళ్లతో దయ్యం మాడు ఎగిరేట్టు కొట్టారు.

ఆ దయ్యం పెనుకోపంతో గావుకేకలు

## శ్రీదేవి రెండో సంతానం!

ఇంకా పుట్టలేదండీ, పుట్టబోయే సంతానమన్నమాట. ఇటీవల ఏదో ఫంక్షన్లో కలిసినప్పుడు శ్రీ, అలనాటి డ్రీమ్‌గరల్ హేమమాలిని తమిళంలో చాలా సేపు మాట్లాడుకున్నారని చాలామంది ఏమిటేమిటో ఊహించేసుకున్నారు. తీరా కనుక్కుంటే వాళ్లు మాట్లాడుకుంది రసమ్-చారు-చేయడం ఎలాగనేదాన్ని గురించిట. (హేమ నడుపుతున్న హిందీ, ఇంగ్లీషు పత్రికలకు పనికొస్తుందని కాబోలు!) ప్రస్తుతం శ్రీ అమెరికా వెళ్లి పుట్టబోయే సంతానానికి కావలసినవన్నీ తెచ్చుకోవడానికి షాపింగ్ చేసే హడావిడిలో వుందట. ఈసారి 'బోనీ' బేబీ పుడతాడని (బోనీకపూర్‌కు కొడుకని) అందరూ అనుకుంటున్నారట. మామూలే కదా!

ఎస్.

వేస్తూ పొగమంచుకింద మారిపోయి మేడమెట్లెక్కింది. మెట్లెక్కుతూ ఆ గదిలో ఉన్న కొవ్వొత్తిని ఆర్పేసింది. పై మెట్టు దగ్గర ఆగి అది తనకు ఎంతో ఇష్టమైన నవ్వొకటి గట్టిగా నవ్వింది. అది ఎంత భయంకరమైన నవ్వంటే, గతంలో అది విన్న ఒక పెద్ద మనిషి విగ్గు క్షణాలమీద తెల్లబడిపోయింది.

దయ్యం అలా భయంకరంగా నవ్వుతుంటే మెట్ల దగ్గరున్న తలుపు తెరుచుకుంది. అందులోంచి ఓటిస్ భార్య బయటకు వచ్చింది. ఆమె చేతిలో కొవ్వొత్తి ఉంది. రెండో చేతిలో ఒక సీసా ఉంది.

"నీకు ఒంట్లో బాగోలేనట్టుందయ్యా! అజీర్తి కాబోలు ... ఈ మందు రెండు చెంచాలు వాడితే తగ్గిపోతుంది!" అన్నదావిడ. ఆ దయ్యం అగ్గి ఫైరయిపోయింది. నల్లని ఒక రాకాసి కుక్క రూపంలోకి మారి ఆవిడను హడలగొట్టేయ్యాలని అనుకున్నది గానీ ఓటిస్ చిన్నకొడుకులిద్దరూ మెట్లకేసి పరుగెత్తి రావడం చూసి, ఎందుకైనా మంచిదని ఆకుపచ్చరంగులోకి ఒక లిప్తకాలం మారి మాయమైపోయింది.

***

ఈసారి దయ్యానికి ఏడుపొచ్చింది. తన గదిలో కూర్చుని అది భోరుభోరున ఏడ్చింది. ఆ అమెరికా కుటుంబం చేసిన అవమానం ఒక ఎత్తయితే, బతికి ఉండగా తాను ఉపయోగించిన కవచాన్ని ఇప్పుడు వేసుకోలేకపోవడం ఒక ఎత్తు. ఆ కవచం ధరించి, అమెరికా వెధవల్ని బెదరగొడదామని వేసుకోబోయింది గానీ, దాని బరువుకు బొక్కబోర్లా పడిపోయింది. మడమలు విరిగినంతపనైపోయింది.

దాంతో అది చాలారోజులపాటు జబ్బుపడిపోయింది. ఒక రకమైన బెంగ కూడా ప్రారంభం అయింది. తన గదిలోంచి కదలలేదు. చివరికి ధైర్యాన్ని కూడదీసుకుని ఓటిస్‌గాడి కుటుంబాన్ని ఉచ్చపోయించకపోతే నేను దయ్యాన్నే కాదు అని శపథం చేసింది.

ఆగస్టు 17వ తేదీ ముహూర్తం పెట్టుకుంది. భయంకరమైన వేషంలో ముందు వాషింగ్‌టన్ గాడి పనిబట్టి ఆ తర్వాత ఓటిస్‌గాడ్నీ, వాడి పెళ్లాన్నీ అదరగొట్టి ఆ వెనుక ఆ కుర్రముండాకొడుకుల్ని పట్టుకు తంతా! దెయ్యమంటే ఏమిటో రుచి చూపిస్తా! అని అది కార్యక్రమావళి తయారుచేసుకుంది.

ఆ రాత్రి భయంకరమైన గాలి వాన వచ్చింది. మరీ మంచిది అని దయ్యం సంతోషించింది. రాత్రి పదకొండున్నరకు ఓటిస్ కుటుంబం అంతా నిద్రపోయింది. దయ్యం నెమ్మదిగా, చప్పుడు కాకుండా నడిచి వాషింగ్‌టన్ గది దగ్గరకు చేరింది. తలుపు దగ్గరగావేసి ఉంటే చివాలున తీసి అది బిక్కచచ్చిపోయింది.

దానికంటే ముందు ఒక భయంకర ఆకారం నిల్చుని ఉంది. దాని కళ్లనుంచి ఎర్రని వెల్తురు కనిపిస్తున్నది. దాని మొహం గుండ్రంగా తెల్లగా ఉంది. అది పళ్లన్నీ బయటపెట్టి నవ్వుతున్నది గానీ చప్పుడు వినిపించడంలేదు. దాని తల బోడిగా నున్నగా ఉంది. దాని ఒంటిమీద చండాలమైన దుస్తులున్నాయి. అది చాలక దాని ఛాతీమీద ఒక కాగితపు బిళ్ల వేలాడుతోంది.

అంతకు ముందెన్నడూ అది ఆ దయ్యాన్ని చూసి ఉండలేదు కనుక దానికి చాలా భయం వేసింది. దానికేసి మరోసారి చూసి 'అమ్మయ్యో! దయ్యం!' అని అరుస్తూ అది తన గదిలోకి ఆఘమేఘాల మీద పారిపోయింది. గదిలో కూర్చుని చాలాసేపు ఆలోచించిన తర్వాత దానికి కొంత ధైర్యం వచ్చింది.

దయ్యాలన్నీ ఒకటే గదా! ఒక దానికి ఒకటి తోడు గదా... చీకట్లో దాన్ని చూస్తే భయంగానీ, పొద్దున్న ఎండెక్కిన తర్వాత దాన్ని కలుసుకోవచ్చు ... పగటిపూట మనకి ధైర్యంగా ఉంటుంది అనుకుని అది పొద్దెక్కినాక ఆ కొత్త దయ్యం దగ్గరకు వెళ్లింది.

దగ్గరకు వెళ్లినాక దానికి ఓటిస్ పెద్దకొడుకుమీద ఓపరాని కోపం వచ్చింది.

గాడిద కొడుకు నన్ను మోసం చేస్తాడా? బూడిద గుమ్మడికాయకి రంగులేసి నన్ను జడిపిస్తాడా? రాత్రిపూట కాబట్టి జడుసుకున్నాను గానీ పగటిపూట ఇలాంటి దిష్టిబొమ్మల్ని చూసి భయపడతానా? నేను దయ్యాన్ని కానా? అని ఆ దయ్యం పరిపరి విధాల ఆలోచిస్తూ తన గదిలోకి వెళ్లిపోయింది.

దానికి నీరసం వచ్చేసింది. దర్జాగా వీళ్లనీ, వాళ్లనూ జడిపిస్తూ కాలక్షేపం చేసిన నేను, వీళ్లనీ, వాళ్లనూ చూసి దడుచుకునే హీనస్థితికి దిగజారిపోయానే అని చింతించింది.


ఇక లాభంలేదు, ఈ అమెరికా దరిద్రులు మనల్ని చూసి జడుసుకోరు. వాళ్ల కంటికి కనిపించకుండా కాలక్షేపం చేస్తే అదే చాలు. రోజులు మారిపోయాయి కదా! మనం కూడా మారాలి అని అది నిర్ణయించుకుంది. ఆ తరువాత చాలారోజులు అది ఎవరి కంటా పడకుండా రహస్యంగా బతికింది.

***

ఓరోజు ఓటిస్ కూతురు వర్జీనియా తన స్నేహితుడితో కలిసి గుర్రపు షికారుకు వెళ్లింది. ఆ సరదాలో ముళ్లకంచెలకు తగిలి ఆవిడ బట్టలు చిరిగిపోయాయి. అమ్మా, నాన్న తిడతారనే భయంతో ఆ పిల్ల పెరటి దారి క్షేమం అని నిర్ణయించుకుని పెరటి కుర్చీ మెట్లమీద నుంచి మేడ ఎక్కింది. వెనకాల గదిలో ఎవరో ఉన్నట్టు కనిపించి తలుపు తోసుకుని గదిలోకి అడుగుపెట్టింది.

ఆ గదిలో కిటికీ చిడీ మీద కూర్చుని దయ్యం ఏదో ఆలోచిస్తున్నది. దాన్ని చూడగానే జడుసుకోవలసిన వర్జీనియాకు భయం బదులు జాలి కలిగింది. దయ్యం బెంగపెట్టుకున్నట్టు, దిగులుతో కుంగిపోతున్నట్టు ఆ పిల్లకు అనిపించింది.

"నిన్ను చూస్తే నాకు జాలేస్తున్నది. పాపం, రేపు నా తమ్ముళ్లిద్దరూ ఊరెళ్తున్నారు. నువ్వు



బుద్ధిగా ఉంటే నిన్నెవరూ ఏమీ అనరులే!" అన్నదా పిల్ల దయగా.

దయ్యం ఉలిక్కిపడి ఇహలోకంలోకి వచ్చింది.

"ఏమిటీ?" అని చిరాకుగా అడిగింది. ఆఖరికి ఆడపిల్లకు కూడా మనమంటే భయం లేకుండా పోయింది అని దానికి లోపల మండుకొచ్చింది.

"బుద్ధిగా నీ మానాన నువ్వుంటే నిన్నెవరూ ఏమీ అనరు!" అన్నది వర్జీనియా.

"భలేదానివే... నా గొలుసులు చప్పుడు చేయకపోతే రాత్రిపూట అరుస్తూ తిరగకపోతే నేను బతికి లాభం ఏమిటి?"

"పాడు బతుకు బతికి లాభమేమిటి? నువ్వు దుర్మార్గంగా బతికావని ఈ ఇంట్లో ఉండే ముసలావిడ చెప్పింది ... నువ్వు నీ భార్యను కత్తితో పొడిచి చంపేశావట కదా!" అన్నది వర్జీనియా.

"అది నా కుటుంబ వ్యవహారం. నా సొంత వ్యవహారాలతో ఇతరులకు ప్రమేయం లేదు!" అన్నది దయ్యం.

"అసలు ఎవరినైనా చంపడం నేరం!"

"నేరమెలాగ అవుతుంది? మా ఆవిడ వంట ఎంత ఛండాలంగా చేసేదీ నీకేం తెలుసు? ఒకసారి నేనొక లేడిని వేటాడి తెస్తే దాన్ని ఎంత ఛండాలంగా వండిందంటే ... ఇప్పుడన్నీ ఎందుకులే ... ఆవిడ అన్నదమ్ములు నాకు తిండిపెట్టకుండా మాడ్చి చంపడం మాత్రం న్యాయమా?" అన్నది కోపంగా.

"అంటే, ఆకలేస్తున్నదా? తినడానికి ఏమైనా తెచ్చేదా?" అని దయగా అడిగింది వర్జీనియా.

"నువ్వు మంచిదానివి. మీ అమ్మా నాన్నా మూర్ఖులు! మీ అన్నయ్య గాడిదకొడుకు. మీ తమ్ముళ్లు దెయ్యాలు ...!" అన్నది దెయ్యం కక్షగా.

"మా వాళ్లను ఏమీ అనవద్దు. నువ్వు దుర్మార్గపు దయ్యానివి. మమ్మల్ని నానా బాధలూ పెట్టాలని చూశావు, నిద్దరలేకుండా చేయాలని చూశావు."

"నేను మాత్రం నిద్రపోయానా? మూడొందల సంవత్సరాలైంది నేను పడుకుని....! నీరసంగా ఉంది, విశ్రాంతి తీసుకోవాలని ఉంది."

"మరైతే నిద్రపోరాదూ?"

"మాకు నిద్ర రాదు. దయ్యాలకు చస్తే తప్ప విశ్రాంతి లేదు. కానీ మాకు చావు కూడా సులభంగా రాదు. మాకోసం నీలాంటి దయగలవాళ్లు దేవుడ్ని ప్రార్థించాలి. మాకు కన్నీళ్లుండవు గనుక నీలాంటి అన్నెం పున్నెం తెలియనివాళ్లు మాకోసం ఏడవాలి. అప్పుడు మృత్యువు మమ్మల్ని కనికరిస్తుంది. అప్పుడే మాకు నిద్దరొస్తుంది. కానీ మాకోసం నువ్వు ప్రార్థిస్తే నీకు చీకట్లో భయంకరమైన ఆకారాలు కనిపిస్తాయి. ఏవేవో చప్పుళ్లు వినిపిస్తాయి. కానీ నీకు అపకారం జరగదు. ఆ భయాన్ని నువ్వు తట్టుకుంటే చాలు...!" అన్నది దెయ్యం.

వర్జీనియా ఆ దయ్యం భుజంమీద దయగా చేయి వేసి, "నాకు భయం లేదు, నీ కోసం మృత్యువును ప్రార్థిస్తాను, పద!" అన్నది.

దయ్యం ఆ పిల్ల చేయి పుచ్చుకుంది. "పద!" అంది. ఇద్దరూ గోడలోనుంచి నడుచుకుంటూ వెళ్లిపోయారు.

***

వర్జీనియా కనిపించకపోయేసరికి ఓటిస్ కుటుంబం కంగారుపడిపోయింది. ఆమెకోసం వెతకని చోటు లేదు. కుటుంబం అంతా బెంగపెట్టుకున్నారు. ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటున్న యువకుడు, బంధువులూ అంతా కంగారుపడిపోయారు.

చివరికి ఆమె, తన గదిలోనే ప్రత్యక్షం అయింది. ఆమె బాగా నలిగిపోయి, పాలిపోయి ఉంది. కళ్లుమాత్రం కాంతివంతంగా మెరుస్తున్నాయి. ఆమె చేతిలో ఒక దంతపు పెట్టె ఉంది.

"ఎక్కడికెళ్లావు, ఏమైపోయావు?" అని అందరూ ఆమెను ప్రశ్నించారు.

"నేను దయ్యంకోసం మృత్యువును ప్రార్థించడానికి వెళ్లాను. ఎలాగైతేనేం, మృత్యువు దయ్యాన్ని కరుణించింది. చచ్చిపోతూ ఆ దయ్యం ఈ నగల పెట్టె నాకు కానుకగా ఇచ్చింది!" అన్నది.

తరువాత అందర్నీ తీసుకువెళ్లి నేలమాళిగలో ఉన్న ఒక శవపేటికలో దయ్యపు అస్థిపంజరాన్ని చూపించింది. ఆ అస్థిపంజరానికి అంతిమ సంస్కారం చేయించితే ఆ దయ్యానికి ఆత్మశాంతి కలుగుతుందని అందరూ చెబితే ఆ కుటుంబానికి చెందిన ఆ ఇంటి యజమాని లార్డ్ కాంటర్‌విల్ వచ్చి ఆ కార్యక్రమం జరిపించాడు.

తరువాత ఓటిస్ ఆ నగల పెట్టె తీసుకువచ్చి లార్డ్ కాంటర్‌విల్‌కి ఇచ్చి "అయ్యా! ఈ నగలు మీ కుటుంబానికి చెందినవి కాబట్టి మీరే తీసుకోవాలి!" అన్నాడు.

"అది నిజమే గానీ, మీరు ఈ ఇంటినీ, దీనిలోని దయ్యాన్నీ కూడా కొనుక్కున్నారు. గుర్తున్నదా? కాబట్టి ఈ దయ్యం ఆస్తిపాస్తులు కూడా మీవే!" అనేశాడు లార్డ్ కాంటర్‌విల్.

ఆ నగలన్నీ వర్జీనియాకే దక్కాలని అందరూ నిర్ణయించారు. ఆమెకు కోరుకున్న వరుడితో పెళ్లయింది.

పెళ్లయిన తర్వాత భార్యాభర్తలిద్దరూ ప్రేమయాత్ర చేశారు. తిరిగి వచ్చిన తరువాత వర్జీనియా, ఆమె భర్తా కబుర్లు చెప్పుకుంటూండగా.. "భార్యా భర్తల మధ్య రహస్యాలుండకూడదు!" అన్నాడు భర్త.

"నీ దగ్గర నేను ఏ రహస్యాలూ దాచలేదు!" అన్నది వర్జీనియా తెల్లబోతూ.

"నువ్వు దయ్యంతో కలిసి ఎక్కడికో వెళ్లావు కదా ... అప్పుడు ఏం జరిగిందో చెప్పలేదు!" అన్నాడు ఆమె భర్త.

"అది నన్ను అడగవద్దు. నేను చెప్పలేను. బతుకంటే ఏమిటో తెలిసింది. చావంటే ఏమిటో తెలిసింది. చావుకంటే, బతుకు కంటే ప్రేమ ఎంత గొప్పదో తెలిసింది. అంతకు మించి నన్నేం అడగద్దు!" అన్నది వర్జీనియా. ■

